# కొమ్మమీద కోయిల

కూ< కూ< మని కోయిల కూయగానే నాకు మెలకువ వచ్చింది. మెలకువతో పాటు కలలన్నీ కరిగిపోయేసరికి ఉలిక్కిపడి కిటికీలోంచి బయటకు చూశాను. మామిడిచెట్టుమీద కోయిల కూ< అని నన్ను పిలవగానే నేను కూడా కూ< అని రెట్టించాను. వేపచెట్టు పూసింది. మామిడిచెట్టు పంటతో నిండింది. వసంత మొచ్చింది. ఎటు చూసినా ఉల్లాసమే.

ఒక్క ఉరుకున కిందకు వెళ్ళాను. వెళ్ళడం వెళ్ళడం పూజ చేసుకుంటున్న అమ్మదగ్గరకు వెళ్ళి "అమ్మా" అని పిలిచాను. ఆవిడ నావంక చూచింది కాని ఆదిత్య హృదయం పారాయణ మానలేదు. మళ్ళీ పిలిచే సరికి "ముందు మొహం కడుక్కొని రా" అని ఆజ్ఞాపించింది. నేను ముఖం కడుక్కొని వంటింట్లోకి వచ్చేసరికి కాఫీ గ్లాసుతో ఎదురయ్యింది.

"అమ్మా! కోయిల" అన్నాను.

ఆవిడ ఏం మాట్లాడలేదు.

"మామయ్యగారి ఊరు వెళతాను" అని అన్నాను.

ఆవిడ ఫక్కున నవ్వి కాఫీ గ్లాసు చేతిలో పెట్టి పెరట్లో తులసికోట దగ్గర సంధ్యావందనం చేసుకుంటున్న నాన్న దగ్గరకు వెళ్ళి ముసిముసి నవ్వులు నవ్వుతూ నిలబడ్డది. సహస్ర గాయత్రీ పూర్తయితేనే గాని ఆదిదేవుడు అవతరించినా అటు చూడని మా నాన్న యిల్లాలి ప్రసన్నవదనం చూసి మనస్సులోనే భూర్భువస్సువః అని అనుకుంటూనే కన్నులతో 'ఏం పిల్లా' అని చిలిపిగా పలకరించాడు. ఆయన ప్రశ్నకు సమాధానంగా అమ్మ కూ< అని అన్నది.

మామిడి చెట్టుమీద కోయిల జంట దొరికిందని కూ< అని సంతోషంగా బదులు పలికింది. పూజ పూర్తిచేసి నాన్న చిరునవ్వుతో అమ్మవంక చూసి 'ఏం పిల్లా' అంటూ ఆవిడ చెయ్యి పట్టుకోబోయేసరికి ఆవిడ మందహాసంతోటే మందలింపుగా "అబ్బాయి చూస్తాడు" అని వారించింది. ఆ మాటలతో యిద్దరికీ తమ తమ అప్పటి వయస్సు గుర్తొచ్చి రవ్వంత ఎడంగానే వుండి

"తెల్లవారకుండానే ఏమిటి విశేషం?" అని నాన్న అడిగారు.

"అబ్బాయి వాళ్ళ మామయ్యగారి ఊరు వెడతాడట."

"ఎందుకనో?"

"కోయిల కూసిందట."

"ఏ కోయిల? మామయ్య యింట్లోదా?"

"కాదు. మన మామిడిచెట్టుమీద కోయిల."

"అయితే అక్కడకు వెళ్ళడం దేనికో?"

"ఆ కోయిల చేత కూడా కూఁ అనిపించడానికి."

తలుపుచాటున నిలబడి యీ మాటలన్నీ నేను వింటున్నానని వాళ్ళకి బాగా తెలుసు. అందుకని రవ్వంత బిగ్గరగానే మాట్లాడుకుంటున్నారు.

తూర్పు దిక్కున ప్రయాణానికి ఈరోజు బాగానే ఉంది. త్వరగా వాడికి భోజనం పెట్టి పంపించు. డబ్బు ఎంత కావాలో కనుక్కో" అని నాన్న అమ్మతో చెప్పి ఊళ్ళోకి బయలుదేరాడు. నేను ఏనుగెక్కినంత సంబరంతో మామిడిచెట్టు మీది కోయిలని కూఁ అని పలకరించేసరికి యీ మొగగొంతుకు బదులు పలకకుండా కోయిల మామయ్యగారి ఊరివైపు ఎగిరిపోయింది.

మామయ్య కిష్టమని అమ్మచేసిన పూతరేకులు, మా తోటలోని ఎర్ర అరటిపళ్ళ గెల పుచ్చుకుని నేను ప్రయాణ సన్నాహంలో వుండగా, నాన్న పిలుపు విని ఆయన దగ్గరకు వెళ్ళాను. నన్ను చూసి చిరునవ్వుతో

"ఏరా మామయ్య ఊరు వెడతానన్నావటగా?"

"అవును నాన్నా."

"ఏదన్నా ప్రత్యేకమైన పని ఉందా?"

"అసలు... మరేమో... అదికాదు నాన్నా..."

"వైశాఖ శుద్ధ పంచమి అన్ని విధాల బాగుందని మీ మామయ్యతో చెప్పు'

"దేనికి బాగుంది?"

"పెద్దవాళ్ళని ఎదురుప్రశ్నలు అడగకూడదు. మేము సమాధానం చెప్పకూడదు."

"అడగనులే."

"మంచిది. అత్తయ్యని వాళ్ళని అడిగానని చెప్పు."

"చెబుతాను."

"క్షేమంగా వెళ్ళిరా."

మామయ్యగారి ఊరి చేరేసరికి మధ్యాహ్నం రెండు గంటలయ్యింది. ఎండ మెండుగా లేకపోయినా ఊరు అన్ని పల్లెటూళ్ళలాలాగే మగత నిద్దురలో ఉంది

వరండాలో కునికిపాట్లు పడుతున్న లక్ష్మయ్య మువ్వల చప్పుడు విని ఒక్క క్షణం మగతగా నావంక చూసి "అయ్యగారూ, అల్లుడుగారు వచ్చారు" అని అనేసరికి, అత్తయ్య తలుపుతీసి, నన్ను చూసి అమిత సంతోషంతో,

"ఎన్నాళ్ల కొచ్చావురా చంద్రం" అంటూ లోపలికి ఆహ్వానించింది. వాళ్ళ అక్కయ్య పంపిన పూతరేకులు చూపించే దాకా మామయ్య ముభావంగానే వున్నాడు.

"ఉత్తరమైనా రాయకుండా వచ్చావు, ఏమిటి విశేషం!" అని అడిగాడు. నేను ఒళ్ళంతా కళ్లుచేసుకుని యిల్లంతా వెతుకుతూ,

"ఏం లేదు మామయ్యా! సరదాపుట్టింది. వచ్చాను" అని నేను అనేసరికి ఆయన నావంక చిరునవ్వుతో చిలిపిగా చూసి

"మేడ మీద గదిలో వుంది" అని అనేసరికి, ఆ సమాధానం ఒక్క క్షణం అవగాహన కాకపోయినా, ఇటు ఏడుతరాలు, అటు ఏడు తరాలు పండితులు, కవుల వంశంలో పుట్టడంవల్ల క్షణకాలంలో తెప్పరిల్లుకుని, ఎగిరి గంతువేసి యిరవై రెండు మెట్లు రెండంగల్లో ఎక్కి గూటికి చేరుకునేసరికి అక్కడ ఎవ్వరో అప్పరస మంచానికి అడ్డంగా పడుకుని ఎవరిదో చిత్రపటం తదేక ధ్యానంతో చూడటం గమనించి, నాదేమోనని ఒక్కక్షణం నాలో నేను మురిసి చిన్నదానికి నా సవ్వడి తెలియకుండా అడుగులో అడుగు వేసుకుంటూ దరి చేరి చూస్తే ఒళ్ళంతా జిర్రులు పాకి అంతులేని ఈర్ష్య నాలో పొడచూపి ద్వేషం దావానలంలాగా నన్ను నిలువెల్లా దహించివేస్తూవుంటే, కోపంగా,

"శ్యామా" అని కోపంగా పిలిచాను.

ఎందుకంటే ఆ చిన్నది యింతవరకూ రెప్పవాల్చకుండా చూస్తున్నది నా ఫొటో కాదు. తన నటనా చాతుర్యంతో, రూపమాధుర్యంతో ప్లేబ్యాక్ గాన నైపుణ్యంతో అశేష జనాన్ని ఉర్రూతలూగించిన ఒక చలనచిత్ర నటుడిది. ఇంతకంటే అన్యాయం ఏముంది? ఏం ఘోరం జరగాలి? సప్త సముద్రాలు పొంగి భువిని తనలో ఇముడ్చుకొనడానికి ఆదిమధ్యాంతరహితుడు, త్రికాలవేదుడు, సర్వజ్ఞుడు అయిన ఆ ఆదివిష్ణువు పాలు త్రాగే పసిబిడ్డడై మర్రి ఆకుపై పవ్వళించటానికి యింతకంటే అవకాశం ఏమిటి? అభ్యంతరం ఏమిటి? చిన్నది ఉలిక్కిపడి నావంక చూసింది. ఆశ్చర్యం, ఆనందం అన్నీ ఒక్కసారి కనిపించి ఆప్యాయంగా 'బావా' అనేసరికి నేను పరశురాముడిని వామనుడిగా మారినమాట వాస్తవమే గాని, ఆ అట్టమీద బొమ్మ మా యిద్దరిమధ్యకు మళ్ళీ అడ్డమొచ్చేసరికి- నేను మళ్ళీ తారాస్థాయిలో "శ్యామా, ఏమిటది?" అని అడిగాను.

"ఎప్పుడు వచ్చావు? అత్తయ్యా వాళ్ళు కులాసానా?"

"ఇప్పుడే వచ్చాను. మళ్ళీ ఇప్పుడే వెళ్ళిపోబోతున్నాను."

"ఎవరి మీద కోపం?"

"నీమీదనే."

"ఎందుకని?"

"ఆ పరాయి మగాడి ఫోటో..."

"అదా. అసలు సంగతి చెప్పనా?"

"చెప్పు."

"నిన్న ఉదయం నిద్ర లేచేసరికి మామిడిచెట్టు మీదనుంచి కోయిల కూఁమని కూసింది. నేనూ కూఁ అని రెట్టించాను."

"తరువాత?"

"కోయిలను చూడగానే నువ్వు గుర్తుకు వచ్చావు."

"ఊఁ"

"నల్లటి వస్తువులను చూడగానే ఎందుకనో గాని నువ్వు గుర్తుకు వస్తావు బావా!"

"నేనేం నల్లగా రాక్షసుడిలాగా వున్నానా?"

"కాదు బావా! నల్లటి వస్తువులను చూడగానే చీకటి గుర్తుకు వస్తుంది. చీకటి గుర్తుకు రాగానే చందమామ గుర్తుకు వస్తుంది. చందమామ గుర్తుకు రాగానే మా చంద్రంబావ గుర్తుకువస్తాడు."

"ఇదేమన్నా క్రమాలంకారమా? సరే నిన్న కోయిల కూసింది. తరువాత?'

"మా బావ వస్తే బాగుండును అన్పించింది."

"నాకూ అల్లాగే అన్పించింది. వెంటనే వచ్చాను."

"మంచివాడివి."

"కానీ నీ వాలకం చూడగానే కోపం వచ్చింది."

"ఆ ఫోటో అంటే చాలా ఇష్టం బావా!"

"ఇష్టమా? అయితే నే వెడతాను."

"అది కాదు బావా! ఆ విశాలమైన కళ్ళు, ఆ చక్కటి ముఖం, ఆ కళ్ళల్లోని స్నేహం, ఇవన్నీ చూస్తే నువ్వే గుర్తుకువస్తావు."

నేను సంబరంతో అద్దంలో చూసుకున్నాను. అక్కడ ఆ చిన్నది చెప్పిన సొగసులు కనిపించేసరికి మురిసిపోయి,

"ఈమధ్య బిల్హణీయం చదివావా?" అని అడిగాను.

సిగ్గుతో తల వంచుకుని "ఛీ పో" అని అన్నది.

కాని ఆ మందహాసం వెనుక మమతలే కాని కోపం లేదని నాకు తెలుసు. చనువుగా జడ పట్టుకుని బుగ్గమీద చిటిక వేయబోయాను. జడ విడిపించుకుని కోపం నటిస్తూ, "చిన్నతనం ఎప్పుడు పోతుంది?" అని అడిగింది.

"పెద్దతనం వచ్చినప్పుడు."

"ఇంకా రాలేదా?"

"వచ్చిందేమో కాని నీ ముందు ఎప్పుడూ ఉంగా పాపాయినేగా!"

"అయితే రా. ఆముదం కలిపి ఉగ్గు పోస్తాను."

"అమ్మాయి" అని అత్తయ్య పిలిచింది.

దాంతో కిందకు దిగక తప్పలేదు.

ఒకరోజు సాయంకాలం నేనూ, మామయ్యా కలిసి ఊరు చివర ఉన్న శివాలయానికి వెళ్ళాం. మామయ్యా వాళ్ళ ఊరు చాలా అందంగా వుంటుంది. ఊరు కంటే అక్కడ శివాలయం అన్నిటికంటే ఎన్నికైంది. చక్కటి పువ్వుల తోట, తోటలో ఒక మండపం, మండపానికి అల్లంత దూరాన శివాలయం, ఆలయానికి వెనుక అతి శాంతముతో ప్రవహించే నది, నది ఒడ్డున ఎవరు నాటారో, ఏనాడు నాటారో జాంబవంతుడంత పొగడచెట్టు, చెట్టు నీడన కూర్చుని చూస్తే నదికి ఆవలి ఒడ్డున దూరంగా కనబడే లంక, లంకలోని పచ్చని పంట...

ఎవరో నలభై సంవత్సరాలు పైబడ్డ మనిషి బిందె భుజాన్న ఎత్తుకుని మెట్లు ఎక్కుతోంది. మామయ్యను చూసి చిలిపిగా చిరునవ్వు నవ్వి, నన్ను చూసి సగంలోనే ఆపి తలవంచుకుని వెళ్ళబోతుంటే మామయ్య చొరవగా,

"వదినా! కులాసానా?" అని అడిగాడు.

"అబ్బాయి ఎవరు?" ఆవిడ చిరునవ్వుతో అడిగింది.

"ఎవరో చెప్పుకో!"

"మీ అక్కయ్య పోలిక. మేనల్లుడా?"

"అవును."

"శ్రీదేవి సరిగ్గా యీ వయస్సులో యిలాగే వుండేది."

"సరిగ్గా యిల్లాగే వుంటే దానికి పెళ్ళే అయ్యేది కాదు."

"చిన్నతనం పోలేదు."

"చిన్నతనం పోయింది. చిలిపితనం పోలేదు."

ఆవిడ మందహాసంతో అక్కడనుంచి కదిలిపోయింది. మామయ్య ఆవిడ వెళ్ళే దిక్కుకే చూచి, నిట్టూర్చి, తనలో తాను అనుకుంటున్నట్టుగా ఏదో అన్నాడు.

"ఏమిటి మామయ్యా?"

"ఖండరాత్ బతలాతీ హై ఇమారత్ బులంద్‌థీ"

అంటే?" అని నేను అడిగాను.

"ఆ మాట సొగసంతా ఆ భాష అర్థమైనప్పుడే. తర్జుమా చేస్తే తేలికై పోతుంది. సుందర మందిరముండేదని శిథిలము పలికేనయ్యా"

"మనకు బంధువులా?"

మామయ్య ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఇంటిదోవ పట్టాడు. నేను వేసే ప్రశ్నలకు సమాధానం రాకపోయేసరికి నేను కూడా ఇకనేం పలకరించలేదు.

ఇంటికి చేరేసరికి అత్తయ్య తెల్లచీర కట్టుకుని తలలో రెండు గులాబీలు తురుముకుని మామయ్యకోసం ఎదురుచూస్తోంది. మామయ్య ఇది పరికించకుండానే ఇంట్లో అడుగుపెట్టబొయ్యేసరికి ఆవిడ భృకుటి ముడిచి, పెదవి విరిచి ఒక్కసారి చెయ్యి విదిలించేసరికి గాజులు గలగలలాడి మామయ్య ఉలిక్కిపడి, కలలోనుంచి తెప్పరిల్లుతున్నవాడిలాగా ఆవిడ వంక చూసి చిరునవ్వు నవ్వాడు. రాత్రివేళ అంతా డాబామీద కూర్చున్నప్పుడు "అలా వున్నారేం?" అని అత్తయ్య అడిగింది.

"పద్మ కనిపించింది."

"ఏమన్నది?"

"ఏమీ అనలేదు. దాన్ని చూస్తే జాలి వేసింది. ఆ అందమంతా ఏమయ్యిందో."

"వయస్సు అయిపోతే యింకా అందచందాలు ఎక్కడుంటాయి?"

"నువ్వు కూడా అల్లాగే అయ్యిపోతావేమోనని బెంగగా ఉంది."

"నాకింకా అందచందాలు దేనికి? పిల్లల అందచందాలు చూసుకుంటే చాలు."

"మామయ్యా! నాన్న నీతో ఒక మాట చెప్పమన్నాడు."

"ఏమిటది?"

"వైశాఖ శుద్ధ పంచమి అన్నివిధాలా మంచిదట."

"దేనికి?"

"తెలియదు."

"మరి తెలుసుకోకుండా ఎందుకు వచ్చావు?"

"చెప్పటానికి సిగ్గుపడుతున్నాడేమో" అని అత్తయ్య నా పక్షం పలికినా అసలు విషయం మాత్రం నాకు అర్థం కాలేదు.

మరునాడు ఉదయం మామయ్య ఊళ్ళోకి వెళ్ళగా చూసి, "నాన్న మాటలకి అర్థం ఏమిటి?" అని అత్తయ్యను అడిగాను.

"నాకు తెలియదు. శ్యామలను అడుగు చెపుతుంది."

"పెద్దవాళ్ళు మీకే తెలియని విషయం దానికి తెలుస్తుందా?" అని నేను కొంచెం దూకుడుగానే అడిగాను.

"ఇది చిన్నవాళ్ళ విషయమే. మాకంటే మీతరం వాళ్ళకే ఎక్కువ తెలుసు' అని అన్నది.

శ్యామల కోసం వెతికితే అది ఇంట్లో కూర్చుని కారం పొడి దంచుతోంది.

"ఒక్క మాట అడుగుతాను చెబుతావా?" అని అడిగాను.

"ఏమిటది?"

"నన్ను చూడగానే దేనికి నవ్వుతావు?"

శ్యామల ఏం మాట్లాడలేదు. ఇంకొకసారి నవ్వి తనపని చేసుకోవడం మొదలు పెట్టింది. నేను రవ్వంత దగ్గరగా కూర్చొని,

"శ్యామా?" అని అన్నాను.

"దూరంగా కూర్చో. కారం చిందిందంటే గోల పెడతావు."

నేను అల్లరిగా ఆ పిల్లదాని జడ పుచ్చుకోబోయాను. తనుకూడా నాకు అందకుండా ఉండాలని తల విసిరింది. జడ నొప్పి పుట్టింది.

"ఇక్కడ నుంచి వెళ్ళిపో" అని కోపంగా అన్నది.

ఈమాట నాకు కొరడా దెబ్బలాగా తగిలింది. మాట్లాడకుండా వచ్చి మేడమీద కూర్చున్నాను. చాలా ఆకలిగా వుంది. పైగా కోపంవచ్చింది. పాకలో ఆవు అంబా! అని అడిలింది. పాలేరు పరుగెత్తుకుంటూవచ్చి దూడని విప్పాడు. ఆ తువ్వాయి సంబరంతో గంతులువేస్తు తల్లి దగ్గరకు వచ్చేసరికి, ఆ దృశ్యం నేను చూస్తూ నిలబడి పోయాను. అల్లా ఎంతసేపు నిలబడ్డానో నాకే తెలియదు. ఎవరిదో తియ్యటి కంఠం మెల్లిగా నిష్ఠూరంగా,.

"ధ్యాన వ్యాజ్య ముపేత్య చింతయసీకాం" అని పలికేసరికి.

"క్షుధానివారణోపాయం" అని నేను సమాధానంజెప్పి వెంటనే నాలిక కరుచుకుని ఆకాశంవంక చూడటం మొదలు పెట్టాను. మామయ్య మహారాజావారి ముద్దుబిడ్డ "తన కోసమే తన శత్రువు" అని పలికింది.

నేను బదులు పలుకలేదు.

"కోపమంతా యిడ్డెన్లమీద తీర్చుకో, సత్తువ లేకపోతే అలకకూడా బాధే' అని ఆ చిన్నది అంటే నేను,

"నాకు ఏం అక్కర్లేదు" అని అన్నాను.

ఆ చిన్నది ఏం మాట్లాడలేదు. కాని అక్కడ నుంచి కదలిన సవ్వడి విని నేను బెరుకుగా అటు చూశాను. నిజంగానే నేను అలిగాననుకుని యిడ్డెన్లు క్రిందకు తీసుకువెళ్ళిపోతే... నేను ఆకలి దప్పులతో సోషిల్లి పడిపోతే, మామయ్య గారి యింటిల్లిపాది భూపాల రాగం పాడితేనే గాని నేను మామూలు మనిషిని కాకపోవచ్చునే.

ఐనా యిదంతా లేనిపోని హైరానా కాబోయే నాథుడు. తనపై కినుక వహించి, అలుగబూనితే అనునయ, వినయాలతోనో అదీ సాధ్యం కాకపోతే ఆరునొక్కటిలో శహనా ప్రారంభించే సరికి యీ మగధీరుడు,

"కలకంఠి కన్నీరొలికిన
వీరి యింటనిలుపదు"

అని చిన్ననాడు తాను వల్లెవేసిన పద్యం గుర్తుకు తెచ్చుకుని, ఎండసోకిన మంచులా తానుకరిగి, కిన్నెరసానెలా ప్రవహించి, కోపగించినది తానని మరచి, తనను అనునయించబోయిన చిన్నారిని తానే లాలించి, నవ్వించి, మరల కవ్వించి, కాంత కనులనిండిన కన్నీరు కన్నుల పండుగయైతే, తాను, తనతో కలలు కన్న చిన్నారి కలకలమని కదిలిపోవటం పరిపాటే...

"బావా!" అని పిలుపు వినిపించింది..... నాలో కోపం సగం శాంతించింది.

"కోపం వచ్చిందా?" అని ప్రశ్నవచ్చింది.

నేను మాట్లాడలేదు.

"కారం కంట్లోపడుతుందేమోనని వెళ్లిపొమ్మన్నాను... జడ ఎంతో నొప్పి పుట్టింది... చూడు మెడంతా ఎల్లా కందిపోయిందో."

నేను అప్పటికీ మాట్లాడకపోయేసరికి

"మాట్లాడకపోతే నామీద ఒట్టు" అని కన్నీటి కంఠంతో అనేసరికి "పిచ్చిపిల్లా నిజంగా కోపం వచ్చిందనుకున్నావా?" అని నేను ప్రశ్నించేసరికి, నాకోపం అంతా బూటకం అని తెలుసుకుని శ్యామల నిజంగానే నామీద కోపం తెచ్చుకుంది.

"ఐతే నీతో మాట్లాడను" అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళబోతే, "నేనాపిల్ల జడపుచ్చుకుని,

"మాట్లాడకపోతే నామీద ఒట్టు" అని నేనూ బెట్టువిడిచి అనేసరికి "మాట్లాడతానుగా ముందు టిఫిను తిను"

అని నాకు హుకుం యిచ్చి, నావంక చిరునవ్వుగాచూసి, క్రిందకు వెళ్లిపోయింది.

ఆకలితీరి కోపం చల్లారేసరికి, అసలు విషయం గ్రాహ్యమై

"శ్యామా!" అని పిలిచాను.

"ఓయి" అని మామిడిచెట్టు దగ్గరనుంచి బదులువచ్చింది. ఒక్కంగలో క్రిందకువెళ్ళాను. నేను కనిపించగానే శ్యామల "ఎందుకు పిలిచావు?" అని అడిగింది.

"మీ మామయ్య, మా మామయ్యతో ఒక మాట చెప్పమన్నాడు. దానికి అర్థం చెబుతావు..."

"ఏమిటా మాట?"

"వైశాఖ శుద్ధ పంచమి మంచిదిట.... దేనికో?"

"కోడె దూడని కొనడానికేమో."

"కాదు క్రొత్త కోడలని తెచ్చుకోవటానికి."

"ఛీ! పో!" అంటూ తానే అక్కడనుంచి వెళ్ళిపోయింది.

శెలవల్లో సరదాగా కాలం గడుపుదామని మామయ్యగారి వూరు వస్తే ఆయనేమో పగలస్తమానం పొలం పని, తోటపని చూచుకుని, సంధ్యవేళకు కాని యింటికి రాడాయె. వచ్చినా, సరాసరి యింట్లోకివెళ్ళి, మడికట్టుకుని తులసికోట దగ్గర కూర్చున్న పెళ్ళాంతో మాటామంతి మొదలు పెడతాడుకాని, మేనల్లుడు యింటికి వచ్చాడే, ఒంటరిగా వాడు ఏం అఘోరిస్తున్నాడో కనుక్కుందామనే ఆలోచన ఏకోశాన్న అయినా వుంటేగా... అత్తయ్య సంగతి చెప్పనక్కర్లేదు. పగలు వంట, మధ్యాహ్నం నిద్ర, సాయంకాలం ప్రొద్దు వాటారగానే, వంట ముగించి మామయ్యకోసం ఎదురు చూడటం. ఆవిడని పలుకరిస్తే, ఆ వేదాంతం ఆధ్యాత్మ రామాయణం కీర్తనలు, ఒక పది నిముషాలు వినేసరికి, నాకు తల నెరిసినట్లు, పళ్లూడిపోయినట్లు, చత్వారం వచ్చి చూపు ఆననట్టు, పదేళ్ళ క్రితమే షష్ఠిపూర్తి చేసుకున్నంత వేదాంతం ఒక్కసారి అబ్బి, మామయ్యకంటె, అత్తయ్య ముందరగా ఎందుకు ముసలిదైందా అని అర్థం చేసుకొనే జిజ్ఞాసలో కొట్టుమిట్టాడి, సమస్య పరిష్కారం కాక, సతమతమై, పెద్ద తరం వాళ్ళని వదిలి మా తరం వాళ్ళతోనే కాలక్షేపం చేద్దామని రెండంతస్థులు దాటి మూడో అంతస్థులోకి చేరేసరికి, మా మరదలు పిల్ల నన్ను చూసి, యీ పదహారు వసంతాలుగా ఎన్నడూలేని క్రొత్త సిగ్గుతో, ముసి ముసి నవ్వులు నవ్వుతూ నేను పలుకరిస్తే బదులు పలుకక, నేను

దరిజేరితే చెంత నిలువక ఒక్క క్షణం బెరుకుగా నా వంక చూసి, చెంగున అక్కడనుంచి పారిపోతే, నేను మా వూరికోసం విరహం పడవలసి వచ్చి, వెంటనే వెళ్ళిపోతే మామయ్య మనస్సు నొచ్చుతుందేమో, అత్తయ్య బాధపడుతుందేమో, అందరికన్నా ముఖ్యం అత్తయ్య కూతురు అలిగిపోతుందేమోనని యిన్ని రకాల సమస్యలతో సంకోచంతో సతమతమై చికాకుతో చిక్కిన మనస్సుతో జామిచెట్టు దగ్గరకు వెళ్ళేసరికి, మల్లెపందిరి నుంచి ఆడజాతి కంఠం ఒకటి విని, 'ఏమిటా' అని ధ్యానంగా ఆలకించే సరికి,

"ఎందుకే నీకింత తొందరా?" అని ఆ యింటి ఆడబడుచు ఆలపిస్తోంది. నేను పాట అంతా విని చివరకు,

"జలజా!" అని నేను పిలిచేసరికి, ఆ భీతహరిణేక్షణ, చెంగున ఎగిరి గంతువేసినంత పనిచేసి "అమ్మదొంగా!" అని అక్కడనుంచి వెళ్ళబోయింది.

"ఆగు!" అని అధికార పూర్వంగానే అన్నాను. వెంటనే ఆ ఎలనాగ నిలిచి,

"ఎందుకూ?" అని ఒక ప్రశ్న క్రీగంట విసిరింది.

"నేను మా వూరు వెళ్ళిపోతున్నాను."

"ఎప్పుడు?"

"రేపు ప్రొద్దున్న."

ఈ మాట వినగానే, అణుబాంబు ప్రేలినంత ప్రళయం జరుగుతుంది. శోకాకుల కంఠితయై ఆ గాన కోకిల,

"వద్దు బావా, నన్ను వదిలి వెళ్ళొద్దు" అని పాట పాడుతూ అనుగుణ్యంగా అభినయం పడుతుంది. అప్పుడు మనం ఒకటి రెండు క్షణాలు, రవివర్మ రచించిన విశ్వామిత్రుడు భంగిమలో నిలబడవచ్చు. తరువాత వారి అనునయ వాక్యాలకు కరిగినట్టు నటించి, ఆ చంద్రికను లాలించి, చిరునవ్వు వెన్నెలలు వెదజల్లేటట్టు చెయ్యవచ్చు. వాళ్ళ కోరిక మీదనే ఆగినట్టు ప్రయాణానికి తాత్కాలిక వాయిదావేసి మొదట్లో అనుకున్న గడువు వరకూ యీ సీమలోనే వుండవచ్చు. అని ఆలోచన వచ్చింది... కాని యీ ఆలోచనలకి పన్నాగాలకి పూర్తిగా, నూరుశాతం విరుద్ధంగా, మా శ్యామల నావంకకైనా చూడకుండా, తోటలోంచి సావిట్లోకి, సావిట్లోంచి మేడమీద మూడో అంతస్థులోకి రెండంగల్లో చేరటం చూసి, ఇదేం సజావుగా లేదు. చిన్నది ఏం అఘాయిత్యం చేస్తుందోనని భయపడి, వెళ్ళి చూసేసరికి మంచానికి అడ్డంగా పడుకుని, వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఆ దృశ్యం చూడగానే, నేను మంచులాగా కరిగిపోయాను. మనస్సు వికలమైపోయింది. మంచంమీద ఒక ప్రక్కన నేనూ కూర్చొని శ్యామల వంక

చూశాను. ఆ పిల్లను ఓదార్చాలని నా ఉద్దేశ్యం. కాని రేగిన జుట్టు కరిగిన కాటుక, దుఃఖంతో ఎరుపెక్కిన ముఖం చూస్తే మా శ్యామల అన్ని రోజులకంటే, యీనాడే ఎక్కువ అందంగా వుంది. ఇల్లా చెయ్యమని మన హైందవ పురాణాల్లో ఎక్కడా చెప్పకపోయినా, హూణ విద్య నేర్చుకుని, యింగ్లీషు సినిమాలు చూసిన అలవాటువల్ల ఆ పిల్లచేతిని నా చేతిలోకి తీసుకొని,

"శ్యామా! ఐ లవ్ యూ" అని అన్నాను.

శ్యామల ముఖం యింకా కందగడ్డ అయింది. కోపంతో మాత్రం కాదు. తలవంచుకుని, మెల్లిగా నా చెయ్యి విడిపించుకుని, తలుపు దగ్గరకు వెళ్ళి చిరునవ్వుతో, సిగ్గుతో,

"కొంటెవాడా!"అంటూ క్రిందకు పారిపోయింది.

నేను వూరు వెళ్ళేరోజు నిజంగానే వచ్చింది. రేపు మా వూరు వెళ్ళిపోవాలి. వెళ్ళక తప్పదు. ఆ రోజు రాత్రి ఎంతో ధైర్యం చిక్కబట్టుకుని వెన్నెల వేడిగా కాసే వేళ, మేడమీదకు వెళ్ళాను. అత్తయ్యా మామయ్యా వెన్నెల్లో కూర్చుని తాంబూలం వేసుకుంటున్నారు.

"మామయ్యా" అని నేను మెట్లచివరనుంచి పిలవగానే, అత్తయ్య రవ్వంత ఎడంగా జరిగింది. మామయ్య మామూలు ధోరణిలోనే తాపీగా,

"ఏరా అబ్బీ!" అన్నాడు.

"రా చంద్రం" అని అత్తయ్య అన్నది.

వెళ్ళి మామయ్య దగ్గర కూర్చున్నాను... నేనేదో పనిమీద వచ్చానని వాళ్ళు యిట్టే గ్రహించారు. చెబుదామనుకున్న మాట నోటిదాకా వచ్చింది కాని, అత్తయ్యని చూస్తే సిగ్గు వేసింది.

"చెప్పరా సిగ్గుదేనికి?" అని మామయ్య అన్నాడు.

"నేను క్రిందకు వెళ్ళనా?" అని అత్తయ్య అడిగింది.

"అక్కర్లేదమ్మా యిక్కడే వుండు" అని నేను అన్నాను.

"అయితే అసలు విషయానికి రా" అని మామయ్య అన్నారు.

"నేను... నేను శ్యామలని ప్రేమిస్తున్నాను" అని నేను బిగ్గరగానే అన్నానని నా ఉద్దేశ్యం. కాని గొంతుక పొడి ఆరిపోయి మాట నూతిలోంచి వచ్చినట్టు వినిపించిందో ఏమో!

"మంచినీళ్ళు కావాలా?" అని మామయ్య అడిగాడు.

"అవ్వ! మా కాలంలో యీ ప్రేమలు అవి ఎరగనమ్మ!!" అని అత్తయ్య బుగ్గలు నొక్కుకుంటూ అనేసరికి.

"ఒసేయి! ఒసేయి! అబద్ధాలాడకే యీ వయస్సులో మళ్ళీ ఆడపిల్లలు పుడితే పెళ్ళిళ్ళు చెయ్యలేమే" అని కంగారుగా, గాభరాపడుతూ మామయ్య అత్తయ్యని బ్రతిమాలుకున్నాడు...

మళ్లీ ఒక్కక్షణంలో తమాయించుకుని,

నువ్వు మా శ్యామలని ప్రేమిస్తున్నావు? సరే! అయితే నన్నేం చెయ్య మంటావు" అని మామయ్య ఎదురు ప్రశ్న వేశాడు.

"అత్తయ్య! మంచినీళ్ళున్నయ్యా" అని అడిగాను.

ఆవిడ "అమ్మాయి!" అని కేక బెట్టింది. ఆ కంఠస్వరం చూస్తే క్రింద వంట యింట్లో వున్న కూతురుకు వినబడాలని వినబడాలని ఆవిడ ఉద్దేశ్యం."

"ఓయి!" అని మెట్ల గదిలో తలుపుదగ్గర నుంచి, వెంటనే సమాధానం వచ్చేసరికి,

"అమ్మ దొంగ, మీ యిద్దరూ కలిసే ఆడుతున్న నాటకం అన్నమాట, ఇల్లారా!" అని మామయ్య అనేసరికి సిగ్గుపడుతూ, శ్యామల మా ఎదుటకు వచ్చింది.

"బావ ఏమంటున్నాడో విన్నావా?" అని మామయ్యా అడిగాడు ఏమీ తెలియనట్లు, విననట్టు శ్యామల

"ఏమంటున్నాడు?"

"ఏమంటున్నాడో వాడినే అడుగు. ఇందాక మాతో అన్న మాటలు దాంతో కూడా చెప్పారా?"

నాకు చచ్చేచావయింది. ఏం చెప్పను? ఎల్లా చెప్పను? నేను ఆమాటలు పెద్దల సమక్షంలో అంటే విందామని శ్యామలకూడా ఎదురు చూస్తోంది. ఈ నిశ్శబ్దాన్ని భరించలేక అత్తయ్య,

"అల్లుడు సిగ్గుపడుతున్నాడు" అని అనేసరికి.

"సిగ్గు స్త్రీలకు భూషణం" అని మామయ్య అన్నాడు. ఆ మాట విని శ్యామల ఫక్కున నవ్వింది. నాకు ఆపాదమస్తకం మండిపోయేటంత కోపం వచ్చింది. దాంతో సిగ్గు పటాపంచలై అంతులేని ధైర్యంవచ్చి,

"నేనేం సిగ్గుపడటంలేదు. అయినా సిగ్గెందుకు మామయ్యా నేను శ్యామలని ప్రేమిస్తున్నాను అని చెప్పాను."

"విన్నావా అమ్మాయి!" అని మామయ్య అడిగాడు.

"ఊఁ" అని అమ్మాయి పలికింది.

వాడు అన్న మాటలకి అర్థం తెలుసా?

"ఊఁ"

మరి నీవిషయం?

"ఊఁ"

అమ్మాయి ముమ్మారు "వూ" కొట్టింది అదృష్టవంతుడివే. ఇంతకూ ప్రేమించడం అంటే ఏమిటిరా?"

"ప్రేమంటే... అదా మామయ్యా! అదే... అదికాదు మామయ్య అసలు'

"అదేమిటండి చిన్న పిల్లవాడిని అల్లా అడుగుతారు" అని అత్తయ్య వత్తాసుగా వచ్చింది.

ప్రేమ అని ఒక మాట వున్నది అని తెలిసినవాడు, చిన్నవాడు ఎల్లా అవుతాడు పెద్దవాడే. ప్రేమిస్తున్నాను అని అన్నావు కదా... నీ ప్రేమకు లక్షణాలేమిటి?"

"ప్రేమకు లక్షణాలా!... నాకు తెలియదు."

"పోనీలే వెన్నెల ఎట్లా ఉంది?"

"వెన్నెలా? దేనికి?"

"ఎదురు ప్రశ్నలు వేయకుండా అడిగిన వాటికి సమాధానం చెప్పు..."

"వెన్నెల్లో ఎల్లా వుంది?"

"హాయిగా వుంది."

"ఈ మలయ మారుతం..."

"చల్లగా వుంది."

"అందరికన్న అందమైన ఆడది ఎవరు?"

"మా అమ్మ!"

మామయ్య ఒక్క క్షణం నావంక చూసి, అత్తయ్యవంక చూశాడు.

"ఇప్పుడీ ప్రశ్నలన్నీ ఎందుకు?" అని ఆవిడ అడిగింది. ఆవిడ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా మామయ్య నాతో,

"నువ్వు నాతో చెప్పిన మాటలు అబద్ధం. నువ్వు ఎవరినీ ప్రేమించడం లేదు. అందులోను మా శ్యామలను అసలు ప్రేమించడంలేదు. ఏదో మేనల్లుడిని, కావలసినవాడివి, పిల్లనిచ్చి అల్లుడిని చేసుకుందామని అనుకున్నాను... ఇప్పుడు అసలు విషయం తెలిసింది.... ఆ ప్రయత్నం మానుకున్నాను.

"అదికాదు మామయ్య."

"ఏమిటండి మీపిచ్చి మాటలు" అని నేను, అత్తయ్య ఒక్కసారి అన్నాం. ఆయన మా మాటలు వినకుండా శ్యామల చెప్పిన మాటలు విందున్నాడు.

"నువ్వే అన్నీ అబద్ధాలు చెబుతోంది. బావకు నిజంగా నేనంటే ఎంతో ప్రేమ" అని శ్యామల ఏడుపు, కోపంతో చెబుతుంది.

"అదికాదే తల్లీ! నీకంటే పెద్దవాడిని, కన్నతండ్రిని అనుభవం వున్నవాడిని! నిజంగా ప్రేమలో వున్నవాడికి వెన్నెల చల్లగా వుంటుందా? రోహిణీకార్తె ఎండలాగా మండిపోతుందని, మలయ మారుతం ఒంటికి తగిలితే తేళ్ళూ జెర్రులు పాకినట్టు వుంటుందని, శాస్త్రాలు ఘోష పెడుతూవుంటే, వీడు ఏమీ లేదు, అన్నీ మామూలుగానే వున్నాయని సమాధానం చెబుతూ వుంటే, నేను శాస్త్ర ప్రమాణాన్ని కాదని, వీడి మాటలు ఎల్లా నమ్మడం? పోనీ కాల ప్రమాణం మారింది. క్రొత్త నాగరికత వచ్చింది... అందుకని పురాతన శాస్త్రాల రీత్యా యీనాటి సమస్యలు పరిష్కరించ చూడటం పొరబాటే అని అనుకున్నా, ఒకమాదిరిగా ఒప్పుకున్నా.

"త్రికాల వేదమైన ఆ మూడవ ప్రశ్నవుందే దాంట్లోనే మనవాడు అసలు విషయాన్ని బయలుపెట్టింది... ప్రశ్నలో అసలు కీలకం గ్రహించలేదేమోనని, నాకు మేనల్లుడు కదా అని జాలిపడి కన్నకూతురు భవిష్యత్తుకూడా ఆలోచించకుండా శ్యామలవైపు చూపించి కనుసైగ చేశాను. తల ఆడించాను. తల ఆడించాను ఊహూఁ, ఏం లాభం లేందే.

'అందరికన్నా అందమైన ఆడది ఎవరురా?' అని ప్రశ్నవేస్తే ఈ కుఱ్ఱ నాగన్న ఏనుగెక్కినంత సంబరంతో, 'మా అమ్మ!' అని సమాధానం యిచ్చాడు. ఇంతకంటే ఘోరం ఏముంది?"

"అందులో ఘోరం ఏముంది?"

"ఘోరంకాక యింకేముంది? తను ప్రేమించే పిల్లకంటే, అందమైన వాళ్ళు యింకా వున్నారనే వాళ్లు ఏం సుఖపడతారు? పెళ్ళాన్ని ఏం సుఖపెడతారు?'

"దాంట్లో అబద్ధమేముంది? అత్తయ్య అందరికంటే, అందమయిన మనిషి.'

"అత్తయ్య అందాన్ని గురించి ఆలోచించవలసింది మామయ్య... నీ విషయం గురించి ఆలోచించవలసింది బావ. వాడు ఆలోచించడంలేదు కాబట్టి... వాడు నిన్ను ప్రేమించడం లేదు. ఆ ఖచ్చితంగా నిర్ణయించడమయినది."

"ఏమిటండి యీ వితండవాదం...." అని అత్తయ్య ఏదో చెప్పబోయింది.

"నేను చెప్పేది సబబుగా లేదా?" అని మామయ్య అడిగాడు.

"బావంటే నీకు ఎందుకూ కోపం?" అని శ్యామల అడిగింది.

"వాడిమీద నాకు కోపందేనికి? నేను చెప్పింది అవునో కాదో చెప్పమను.'

"బావ కాదు నేను చెబుతాను విను. ఇష్టమైనవాళ్లు, దూరమైనప్పుడే వెన్నెల వేడిగా వుండేది. మలయమారుతం జెర్రులు పాకినట్టు వుండేది, కావలసిన వాళ్లు యిద్దరూ ఒక చోటనే వున్నప్పుడు వెన్నెల హాయిగా వుండక, పిల్లగాలి చల్లగా వుండక ఎల్లా వుంటుంది?"

"మరి మూడో ప్రశ్న?"

"ఇచ్చకాలు అబద్ధాలు చెప్పి ముఖస్తుతి చెయ్యకుండా, బావ నిజం చెప్పాడు. అత్తయ్య అందం ముందర, మే మెక్కడ... నాకు అందం లేదు. అయినా బావకి నేనంటే చాలా యిష్టం. నన్ను ప్రేమిస్తున్నానని మీతో చెప్పాడు. థాంక్సు."

"అసలు..."

"నేను చెప్పేది పూర్తిగా విను..."

"నీకు యింగ్లీషు సంస్కృతం రెండూ చెప్పించడం చిక్కుకే వచ్చిందే.'

నేను శ్యామల వంక తిరిగి "థాంక్యు వెరిమచ్" అని అన్నాను.

"అమ్మాయి వాదం చూశారా ఎంత బాగుందో" అని అత్తయ్య అడిగింది.

"వాదానికేం భేషుగ్గా వుంది కాని ఇప్పుడు దాన్ని ప్లీడరీ చదివించమని మాత్రం నా ప్రాణం తీయక."

అత్తయ్య ఆవలించి, చిటికవేసి,

"నాకు నిద్దర వస్తోంది" అని అనేసరికి, మామయ్య

"నా ప్రక్క ఎక్కడ వేశావు?" అని అడిగాడు.

"వరండాలో" అంటూ అత్తయ్య అక్కడ వుంది. కూతురుతోసహ కదిలిపోవటానికి సిద్ధమవుతూ వుంటే,

మామయ్య, ఆనాడు పంచమి అని తెలిసి కూడా జాలిగా "ఏకాదశి" అని అన్నాడు. అత్తయ్య చిరునవ్వుతో "రేపు ద్వాదశి" అని క్రిందకు వెళ్ళి పోయింది.

కూ,మని కోయిల కూతతో మర్నాడు వుదయం మెలకువ వచ్చింది. నేను అలవాటు ప్రకారం "కూ" అని రెట్టించాను బదులు. మామిడి చెట్టుమీద నుంచిగాదు, దగ్గరనుంచే, ఆగదిలోంచే వచ్చింది. అటుచూస్తే అప్పుడే తలంటు పోసుకుని నిరాభరణ సుందరిగా శ్యామల వచ్చింది. నన్ను చూసి సిగ్గుతో తలవంచి

"కాఫీ చల్లారి పోతోంది" అని అన్నది.

రెండుగంటలకు రెండెడ్ల బండివచ్చి గుమ్మంలో ఆగింది. బండి చూసి బంధువులు ఎవరో వచ్చారనుకుని శ్యామల సంతోషంగా, వీధి వాకిల్లోకి వచ్చి "బండీ ఎవరికి?" అని అడిగింది.

"చిన్నబాబుగారు వూరుకు వెడతారుట" అని లక్ష్మయ్య అనే సరికి, శ్యామల అక్కడ ఆగకుండా మేడమీదకు పరుగు తీసింది.

నాతో మాట్లాడుతున్న మామయ్య అత్తయ్య యీ దృశ్యం చూశారు. "వైశాఖ శుద్ధ పంచమి మాకూ అనుకూలమేనని, బావకు, నువ్వుచెప్పిన మర్నాడు వుత్తరం రాశాను" అని యింకా ఏదో చెప్పబోయి నాతో

"శ్యామలను ఓదార్చిరా" అని అన్నాడు.

తన అలవాటు ప్రకారం శ్యామల మంచానికి అడ్డంగా పడుకుని దిండులో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆ దృశ్యం చూడగానే పోని బండి త్రిప్పి పంపించి వేద్దామా" అని అనిపించింది... అంతలోనే మనస్సు కూడదీసుకుని,

"పిచ్చిదానా ఎందుకు ఏడుస్తావు? యీ వియోగం కొద్ది రోజులేగా." తరువాత మనం జన్మజన్మల వరకు కలిసే వుంటాంగా" అని అన్నాడు.

"ఏమిటన్నట్టు" శ్యామల నా వంక చూసింది.

"మనమిద్దరిని ఏడిపించడం కోసం మామయ్య రాత్రి అల్లా అన్నాడుట... నేనేం కోపం వచ్చి వెళ్లిపోవడం లేదు... లే... నువ్వు నవ్వుతూ నన్ను సాగనంపితేనే. నేను త్వరగా తిరిగి వచ్చేది... ఒక్కసారి నవ్వు...

"త్వరగా వస్తావు కదూ?"

"చాలా త్వరగా వస్తాను."

అత్తయ్య వాళ్ళన్నయ్యకోసం, చేసిన కోవా బిళ్ళలు, కాజాలు, వాళ్ళ అక్కయ్య కోసం మామయ్య తెప్పించిన బత్తాయిలు బండిలో పెడుతూ వుండగా, నేను శ్యామల మెట్టుదిగి క్రిందకు వస్తుంటే, అత్తయ్య మమ్మల్ని చూసి, మామయ్యతో,

"చంద్రానికి పెళ్ళికళ వచ్చింది" అని అనేసరికి మామయ్య అత్తయ్యవంక చిలిపిగా చూస్తూ

"వాళ్ళకంటే పెళ్లికళ నీకే ఎక్కువ వచ్చింది. మళ్లీ పెళ్లి చేసుకుందాం!' అని అడిగాడు.

"నాకు మాత్రం యీ ముసలి మొగుడు వద్దు" అని అత్తయ్య అంటే,

"కోప్పడకే: జుట్టుకు రంగు వేసుకుంటానుగా" అని మామయ్య అనేసరికి శ్యామల పక్కున నవ్వి,

"మళ్లీ ఎప్పుడు వస్తావు బావా?" అని అడిగింది.

నేను బండి ఎక్కి "నీ పెళ్లినాడు" అని అన్నాను. నవ్వుకోపంతో శ్యామల బుంగమూతి పెట్టింది. గజ్జెల చప్పుడు చేస్తు బండీ కదిలింది.